సాక్షి
అనంతపురం
సోమవారం । 27 । మార్చి । 2023



టమాట కిలో రూ.8

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.5.50 పలికింది.



కేజీబీవీ ప్రవేశాలకు వేళాయె

కేజీబీవీల్లో ఆరోతరగతిలో ప్రవేశంతో పాటు 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. 8లో

గరిష్టం/కనిష్టం
40.1°/22.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

సోమవారం	మంగళవారం
ఇఫ్తార్	సెహరి
6.33	5.02

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్


తేలికపాటి వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నందున రాగల రెండు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వాతావరణ బులెటిన్ విడుదల చేశారు. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. బలమైన గాలులు, ఉరుములు, మెరుపులు సంభవించే సూచన ఉన్నట్లు తెలిపారు.

గోవిందవాడలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతుల దుర్మరణం

మృతులు దాసరి కేశన్న, బోయ వండ్రప్ప (ఫైల్)

బొమ్మనహాళ్: ఆరుగాలం శ్రమించి పండించిన మిరపను కర్ణాటక మార్కెట్‌లో విక్రయించేందుకు వెళ్లిన ఇద్దరు రైతులను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఇదే ప్రమాదంలో మరో రైతు, బొలెరో వాహనం డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. మృతులిద్దరూ గోవిందవాడ గ్రామానికి చెందిన వారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం గోవిందవాడకు చెందిన రైతులు దాసరి కేశన్న (27), బోయ వండ్రప్ప (74), కుమ్మరి సోమన్న తాము పండించిన 80 బస్తాల ఎండు మిరపను కర్ణాటక రాష్ట్రం బ్యాడిగ ఆర్ఎంసీ మార్కెట్‌లో విక్రయించేందుకు శనివారం రాత్రి తమ గ్రామానికి చెందిన వన్నూరువలి బొలెరో వాహనంలో బయల్దేరారు. అర్ధరాత్రి సమయంలో బళ్లారి – బెంగళూరు హైవేలోని తమ్మేపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం అతివేగంతో వచ్చి బొలెరో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతులు దాసరి కేశన్న, బోయ వండ్రప్ప అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం పైన ఉన్న మరో రైతు కుమ్మరి సోమన్న, డ్రైవర్ వన్నూరువలి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. రాంపురం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కేశన్నకు భార్య సునీత, ఇద్దరు కుమారులు, వండ్రప్పకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరు రైతులు ఒకేసారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వాహనం అదుపుతప్పి మరొకరు..



మృతుడు సురేంద్ర

నార్పల: బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలలోని కొత్తబస్టాండ్ కాలనీకి చెందిన ఎరికల నారాయణ స్వామి కుమారులు సురేంద్ర (25), దిలీప్, మరో ముగ్గురు కూలీలతో కలసి ఆదివారం ఉదయం టమాట లోడింగ్ కోసం బొలెరోలో బి.పప్పూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో వాహనం బోల్తాపడింది. ఘటనలో సురేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన నలుగురినీ స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. వీరిలో దిలీప్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న సీఐ అస్రార్‌బాషా, ఎస్ఐ రాఘవరెడ్డి అక్కడకు చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ అస్రార్‌బాషా తెలిపారు.

చూసొద్దాం రండి!



పెన్నహోబిలంలోని ఉగ్రనరసింహస్వామి విగ్రహం



గూటిబైలులోని తిమ్మమ్మ మర్రిమాను

- సమీపిస్తున్న వేసవి సెలవులు
- టూర్లకు సిద్ధమవుతున్న పెద్దలు, పిల్లలు
- ఉమ్మడి అనంతలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు
- చుట్టుపక్కలా రమణీయ క్షేత్రాలు
- తక్కువ ఖర్చుతోనే సందర్శించే అవకాశం

అనంతపురం డెస్క్ :

వేసవి సెలవులు సమీపిస్తున్నాయి. పరీక్షలు పూర్తవగానే ఎంచక్కా టూర్లకు వెళ్లడానికి పిల్లలు ఉత్సాహం చూపుతున్నారు. అందుకు అనుగుణంగానే పెద్దలు ఇప్పటి నుంచే ప్లాన్ చేస్తున్నారు. కొందరు షిర్డీ, ఊటీ, గోవా వంటి సుదూర ప్రాంతాలను సందర్శించడానికి ఆసక్తి చూపుతుండగా..మరికొందరు వారి ఆర్థిక స్తోమతను బట్టి ఉమ్మడి జిల్లా పరిధిలోనే, లేదంటే చుట్టుపక్కల జిల్లాల్లో మంచి ప్రదేశాలకు వెళ్లాలని భావిస్తున్నారు. ప్రకృతి రమణీయతను, ఆధ్యాత్మికతను పంచే సందర్శనీయ ప్రాంతాలు మన చుట్టుపక్కలే ఎన్నో ఉన్నాయి. అలాంటి వాటిలో కొన్ని మీకోసం...

ఆధ్యాత్మిక ధామం పుట్టపర్తి..

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిని సందర్శిస్తే వేరే దేశంలో ఉన్నామన్న ఫీలింగ్ కలుగుతుంది. అద్భుతమైన నిర్మాణాలు, హాయిగొలిపే వాతావరణం, అణువణువూ గోచరించే సాయితత్వం మనకు కొత్త అనుభూతి ఇస్తాయి. చైతన్యజ్యోతి మ్యూజియం, నక్షత్రశాల, హిల్‌వ్యూ స్టేడియం, డీమ్డ్ యూనివర్సిటీ, భారీ ఆంజనేయుడి విగ్రహం వంటివి ఇక్కడి ప్రత్యేక ఆకర్షణలు.

ప్రకృతి అందాల ఆలూరు కోన..


రంగనాథస్వామి కొలువైన ఆలూరు కోన తాడిపత్రికి 5 కి.మీ.దూరంలో ఉంది. రెండు కొండల మధ్య నుంచి పెద్దనీటి బుగ్గ ఉత్తర–దక్షిణ దిశగా ప్రవహిస్తూ ఉంటుంది. ఆలూరు కోనకు వెళ్లేవారు తాడిపత్రిలోని చింతల వేంకటరమణస్వామి, బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాలను కూడా సందర్శించొచ్చు. ఇవి పురాతన ఆలయాలు.

విజయనగర చరిత్రకు సాక్షీభూతం పెనుకొండ

విజయనగర వైభవాన్ని, నాటి చరిత్రను తెలుసుకోవడానికి పెనుకొండ సందర్శన ఉపయోగపడుతుంది. కొండపైనున్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, గగన్‌మహల్, బాబయ్య దర్గా, కుంభకర్ణ విగ్రహం, తిమ్మరుసు బందీఖానా, పార్శ్వనాథుడు, అజితనాథ ఆలయాలు సందర్శనీయ ప్రదేశాలు.

'రికార్డు' మర్రి చూడాల్సిందే!..

దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన తిమ్మమ్మ మర్రిమాను ఎన్పీకుంట మండలం గూటిబైలులో ఉంది. కదిరి నుంచి 26 కి.మీ. దూరంలో ఉండే ఈ మర్రిమాను ప్రస్తుతం 8.75 ఎకరాల్లో విస్తరించింది. 6,689 ఊడలు ఉన్నాయి. ఇది 1989లోనే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించింది. తిమ్మమ్మ మర్రిమాను చూడడానికి వెళ్లేవారు మార్గమధ్యంలోని కదిరి పట్టణంలో గల ఖాద్రీ లక్ష్మీనృసింహాలయాన్ని, కటారుపల్లిలోని యోగివేమన సమాధిని కూడా సందర్శించవచ్చు.



ఆలూరు కోన

శత్రుదుర్భేద్యం .. గుత్తికోట

బెంగళూరు – హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఉండే గుత్తి కోటను అప్పట్లో శత్రుదుర్భేద్యంగా నిర్మించారు. దాదాపు 25 హెక్టార్ల విస్తీర్ణంలో శంకు ఆకారంలో కోట ఉంటుంది. ముఖద్వారం నుంచి బురుజు వరకు 101 బావులు, 15 ప్రధాన ద్వారాలు ఉన్నాయి. ఇక్కడి ఆలయాలు, కారాగారం, సొరంగ మార్గాలు, కోడిగుడ్డు బావి, ఏనుగు, గుర్రపుశాలలు ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తున్నాయి.

ఆహ్లాదాన్ని పంచే పెన్నహోబిలం

ఉరవకొండ మండలంలోని పెన్నహోబిల క్షేత్రం మంచి వేసవి విడిది. ఇక్కడి లక్ష్మీనృసింహుడి ఆలయం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతుండగా..చెంతనే ఉండే జలపాతం ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇక్కడికి కొద్దిదూరంలోనే పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) ఉంది. ప్రస్తుతం ఇది జలకళతో కనువిందు చేస్తోంది.



శిల్ప కళల కాణాచి.. లేపాక్షి ...

హిందూపురం నుంచి సుమారు 13 కి.మీ. దూరంలో లేపాక్షి ఉంది. ఇక్కడి వీరభద్రస్వామి ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించింది. శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఆలయంలోని శిల్పకళ అబ్బురపరుస్తోంది. వేలాడే స్తంభం, ఏడు పడగల నాగేంద్రుడు, వటపత్రసాయి చిత్రం ప్రధాన ఆకర్షణలు. ఇక్కడి నందీశ్వరుడి ఏకశిలా విగ్రహం దేశంలోనే పెద్దది.

అబ్బురపరిచే బెలూంగుహలు

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని బెలూంగుహలు పది లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడినవని భూగర్భశాస్త్రవేత్తల అంచనా. భారత ఉపఖండంలో మేఘాలయ గుహల తర్వాత వీటినే రెండవ అతిపెద్ద గుహలుగా పరిగణిస్తున్నారు. ఇవి తాడిపత్రి పట్టణానికి కేవలం 30 కి.మీ. దూరంలో ఉన్నాయి. గుహల లోపలికి వెళ్లిరావడం జీవితంలో మధురానుభూతిగా మిగిలిపోతుంది.

హంపీ అందాలు వీక్షించాల్సిందే

అనంతపురం నుంచి హంపీ కేవలం 165 కిలోమీటర్ల దూరంలో ఉంది. విజయనగర రాజధానిగా విరాజిల్లిన హంపీలో ఎన్నో చూడదగిన చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. ఉత్తరం వైపు తుంగభద్ర నది, మిగతా మూడువైపులా చారిత్రక కట్టడాలతో హంపీ అలరారుతోంది. విరూపాక్ష దేవాలయం, విఠల దేవాలయ సముదాయం, శిలా రథం, గజ శాల వంటివి కనువిందు చేస్తాయి.

నయనమనోహరం నంది కొండలు

కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ జిల్లాలో ఉన్న నందికొండలపై నుంచి సూర్యోదయాన్ని తిలకించడం దివ్యానుభూతికి లోను చేస్తుంది. కొండపై నుంచి చూస్తే మేఘాలపై నుంచి కిందకు చూస్తున్నట్లుంది. బెంగళూరు– హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–44)కి సమీపంలోనే ఉండే నందికొండలకు అనంతపురం నుంచి రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయి. అనంతపురం నుంచి దూరం 178 కి.మీ. మాత్రమే. ఈ వేసవిలో చిన్నారులను నందిహిల్స్‌కు తీసుకెళితే అక్కడి ప్రకృతి రమణీయతను ఎంతగానో ఆస్వాదిస్తారనడంలో అతిశయోక్తిలేదు.

బాల్య స్మృతులు మరువలేనివి




రాయదుర్గంలో పర్యటిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమేష్, శాంతినారాయణ నుంచి పుస్తకాలను అందుకుంటున్న జస్టిస్ రమేష్

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దొనాడి రమేష్

రాయదుర్గం: మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా బాల్య స్మృతులు మాత్రం మరువలేనివని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దొనాడి రమేష్ పేర్కొన్నారు. రాయదుర్గంలోని హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఆయన ఆ రోజు రాత్రి రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో బస చేశారు. ఆదివారం ఉదయం మిత్ర బృందంతో కలసి గ్యాస్‌గోడౌన్ ఏరియాలో చిన్నప్పుడు తాను నివాసమున్న ఇల్లు, పరిసరాలను సందర్శించి, జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. స్నేహితుల ఇళ్లకు నేరుగా వెళ్లి ఆత్మీయంగా పలకరించారు. 45 ఏళ్ల తర్వాత జస్టిస్ హోదాలో రాయదుర్గానికి రావడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ ప్రాంతం తరచూ గుర్తుకొచ్చేదని, అయితే కాల క్రమేణా పట్టణం అభివృద్ధి చెందడంతో ఆనాటి ఆనవాళ్లు గుర్తుపట్టలేకపోతున్నానని తెలిపారు. అనంతరం జస్టిస్ రమేష్‌ను ఘనంగా సన్మానించారు. పలు వార్డుల్లో కలియదిరిగిన తర్వాత తిరుగుపయనమయ్యారు. హైకోర్టు జస్టిస్ వెంట రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.లావణ్య, కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యుగంధర్, మిత్రులు గౌని ఉపేంద్రరెడ్డి, పీఆర్ డీఈ రామమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శాంతినారాయణ రచనలు మార్గదర్శకాలు

అనంతపురం కల్చరల్: డాక్టర్ శాంతినారాయణ రచనలు సమాజానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని హైకోర్టు జడ్జి జస్టిస్ దొనాడి రమేష్ అన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన రమేష్ ఆదివారం రాత్రి అనంతపురం రామనగర్‌లోని డాక్టర్ శాంతినారాయణ ఇంటికి వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతినారాయణ వద్ద తాను చదువుకోవడం గర్వకారణంగా భావిస్తున్నానని, ఆయన రచనలు సమాజానికి మార్గదర్శకాలని కొనియాడారు. శాంతినారాయణ మాట్లాడుతూ తాను రాయదుర్గం ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న సమయంలో రమేష్ చదువుకున్నాడని, ఇప్పుడు హైకోర్టు న్యాయమూర్తి హోదాకు చేరుకుని, తనను కలవడానికి రావడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. అనంతరం తను రచించిన సాధన, సీమ అస్థిత్వచేతనం, ముడి, పెన్నేటి మలుపులు, నాగలకట్టసుద్దులు తదితర పుస్తకాలను జస్టిస్ రమేష్‌కు అందించారు.

ఖాద్రీశుని సేవలో జస్టిస్ వెంకటశేషసాయి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట శేషసాయి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ప్రధాన అర్చకులు ఏవీ నరసింహాచార్యులు, ఏడీ పార్థసారథి చార్యులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ విశిష్టతను వివరించారు. అమ్మవార్ల ఆలయంలో పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించి శేషవస్త్రంతో సత్కరించారు. శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు.

తిమ్మమ్మ మర్రిమాను సందర్శన

ఎన్పీకుంట: మండల పరిధిలోని గూటిబైలు గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మమర్రిమానును ఆదివారం హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకటశేషసాయి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. తిమ్మమాంబ ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వారికి స్వాగతం పలికి సత్కరించారు.



జస్టిస్ వెంకట శేషసాయికి శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ

వైభవంగా సిడిమాను ఉత్సవం



రససిద్దుల కొండపై సిడిమానుకు బాలుణ్ని తిప్పుతున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం సమీపంలోని రససిద్దుల కొండపై శ్రీరస సిద్దేశ్వరస్వామి సిడిమాను ఉత్సవం ఆదివారం సాయంత్రం కనుల పండువగా జరిగింది. సిడిమానుకు బాలుణ్ని కట్టి తిప్పగా.. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనం ఆసక్తిగా తిలకించింది. అంతకుముందు ఉత్సవ విగ్రహానికి గంగపూజ నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

63 వేల ఎకరాలకు విముక్తి

'ఈ భూమి నాది.. ఈ భూమిపై సర్వహక్కులూ నావే. ప్రభుత్వమే రాతపూర్వకంగా, ధ్రువపత్రాలు ఇచ్చి మరీ కల్పించింది'. – ఇదీ ఓ రైతు మాట. ఒక రైతుకు ఇంతకంటే ఏం కావాలి? ఆంధ్రప్రదేశ్ సర్కారు ఇదే చేసింది. అనుభవంలో భూములున్నా హక్కులు లేని కారణంగా ఎన్నో ఇబ్బందులు పడ్డ వేలాదిమంది రైతులు ఇప్పుడు తలెత్తుకు తిరుగుతున్నారు. 22 ఏ (నిషేధిత), డాటెడ్ ల్యాండ్స్ (చుక్కల భూములు) పరిధిలో ఉండి కొనడానికి గానీ, అమ్మడానికి గానీ వీలులేక ఉక్కిరి బిక్కిరి అవుతున్న రైతులకు సర్కారు భరోసా ఇచ్చింది.

- నిషేధిత భూముల జాబితా నుంచి ఊరట
- జిల్లాలో కనీవినీ ఎరుగని రీతిలో రైతులకు లబ్ధి
- 17,452 మంది దరఖాస్తులకు పరిష్కారం చూపిన సర్కారు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్ర వ్యాప్తంగా 2015లో లక్షలాది ఎకరాల భూములను 22ఏ అంటే నిషేధిత భూముల జాబితాలో చేర్చారు. మరికొన్ని భూములను డాటెడ్ ల్యాండ్స్ (చుక్కల భూముల) పరిధిలోకి చేర్చారు. అప్పటి వరకూ అనుభవంలో ఉన్న రైతులు ఒక్కసారిగా హక్కులు కోల్పోయినట్టు అయింది. తమ భూమిని తాము అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కోర్టు తీర్పును అనుసరించి ఈ భూములను క్రమబద్ధీకరించింది. ఎవరైతే అనుభవంలో ఉన్నారో, డాక్యుమెంట్లు ఉన్నాయో ఇలాంటి వాళ్లందరి భూములనూ రెగ్యులరైజ్ చేసింది. అలా నిషేధిత, చుక్కల భూముల జాబితాలో ఉన్న 63,532 ఎకరాలకు విముక్తి కల్పించి ఆయా రైతులను ఆదుకుంది.

503 గ్రామాల్లో వేగంగా రీసర్వే

ఓ వైపు రైతుల భూహక్కులకు సంబంధించి వేలాది ఎకరాలు విముక్తి చేయడమే కాకుండా..అన్ని గ్రామాల్లో భూముల రీసర్వే మొదలైంది. 503 గ్రామాల్లో ఈ ప్రక్రియ ముమ్మరంగా ఉంది. వంద సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసి, వివాదాలకు కారణమైన బూజుపట్టిన హద్దులను చెరిపేసి ఎవరికి ఎంత భూమి, ఎవరి హద్దు ఎంత వరకు అన్న కోణంలో కొనసాగుతున్న ఈ రీసర్వే భవిష్యత్ తరాలకు వివాదాలు లేని హక్కులను ఇవ్వనుంది.

జిల్లాలో నిషేధిత భూములకు విముక్తి ఇలా..

నిషేధిత భూములకు వచ్చిన దరఖాస్తులు	17,161
నిషేధిత భూముల జాబితా నుంచి విముక్తి	62,074.05 ఎకరాలు
చుక్కల భూములకు దరఖాస్తులు	291
చుక్కల భూముల నుంచి విముక్తి	1458.37 ఎకరాలు

రైతులకు భరోసా వచ్చింది

చాలా ఏళ్లనుంచి ఈ భూములు నిషేధిత జాబితాలో ఉండటం వల్ల చాలా మంది రైతులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు వాటిని పూర్తిగా నిషేధిత, డాటెడ్ ల్యాండ్స్ నుంచి తొలగించడంతో పూర్తి హక్కులు వచ్చాయి. అమ్ముకునే, కొనుక్కునే అవకాశం లభించింది. –నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

బాధితులు దరఖాస్తు చేసుకోవచ్చు

ఇప్పటి వరకూ 17వేల మందికి పైగా దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాం. ఇంకా ఎవరైనా ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని పరిశీలించి వాళ్ల భూములకు న్యాయం చేస్తాం. దీనివల్ల చాలామంది రైతులకు మంచి ఉపశమనం కలిగింది.

–కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

ఆకట్టుకున్న శక్తి ప్రదర్శన



ఇరుసు ఎత్తే పోటీల్లో పాల్గొన్న యువకుడు

గార్లదిన్నె: మండలంలోని పాతకల్లూరులో ఉగాది, శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం శక్తి ప్రదర్శన నిర్వహించారు. గుండు, ఇరుసు ఎత్తే పోటీలను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. ఇరుసు పోటీల్లో వంకరాజు కాలువ సురేష్, కల్లూరు రాజు, గుండు ఎత్తే పోటీల్లో మాదాపురానికి చెందిన రాజశేఖర్, ఈశ్వర్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. విజేతలకు నగదు బహుమతి అందజేశారు.



గుండు ఎత్తుతున్న యువకుడు

క్లుప్తంగా

కణేకల్లు చెరువులో మహిళ మృతదేహం

కణేకల్లు: స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి చెరువులో ఆదివారం ఓ గుర్తు మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. ఆకు పచ్చ రంగు చీర, అదే రంగు జాకెట్ ధరించిన మృతురాలికి దాదాపు 48 ఏళ్ల వయస్సు ఉంటుందని పేర్కొన్నారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, ఆచూకీ తెలిసిన వారు 94409 01870, 94407 96825కు ఫోన్ చేసి, సమాచారం అందించాలని కోరారు.

మున్సిపల్ సర్వీస్ డ్రాఫ్ట్ రూల్స్‌పై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్యుడు

రాప్తాడురూరల్: మున్సిపల్ సర్వీస్ డ్రాఫ్ట్ రూల్స్‌పై అభిప్రాయ సేకరణ కోసం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా శాఖ ఆదివారం నగరంలోని కార్యాలయంలో సమావేశమైంది. మునిసిపల్ డ్రాఫ్ట్ రూల్స్‌లో చేయాల్సిన సవరణల కోసం నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. ఇప్పుడున్న సర్వీస్ రూల్స్‌ని యథాతథంగా కొనసాగించాలని ఎస్టీయూ జిల్లా శాఖ తరఫున ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జి.సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఫణిభూషణ్, నగర శాఖ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సురేష్, మురళీకృష్ణ, విరూపాక్షగౌడ్, వేణుగోపాల్, యుగంధర్, గంగాధర్, రవికుమార్, సురేష్ నాయక్, కిషోర్, బాబ్జీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గార్మెంట్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదం



ఫ్యాక్టరీలో ఎగిసి పడుతున్న మంటలు

లేపాక్షి: స్థానిక సార్‌డెనీయం గార్మెంట్స్ పరిశ్రమలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసి పడ్డాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తం చేయడంతో హిందూపురం, మడకశిర ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనాలు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశాయి. ఎంత మేర నష్టం వాటిల్లిందనే అంశంపై యాజమాన్యం స్పష్టత ఇవ్వలేదు. కాగా, ఘటనకు సంబంధించి ఆదివారం సాయంత్రం వరకూ తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు పేర్కొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు వేళాయె

- నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ బాలికలకు ఉచిత వసతి, విద్య
- 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు
- స్థానిక విద్యార్థులకు తొలి ప్రాధాన్యత
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన



రాప్తాడు కేజీబీవీ

రాప్తాడు/రూరల్: చదవాలనే ఆసక్తి ఉన్నా.. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మంది బాలికలు మధ్యలోనే చదువులు మానేస్తున్నారు. అలాంటి వారిలో అనాథ, పేద బాలికలకు కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయాలు (కేజీబీవీ) వరంగా మారాయి. వారి చదువులకు భరోసానందివ్వడమే కాక, పూర్తి భద్రతను కల్పిస్తున్నాయి.ఈ క్రమంలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి అర్హులైన బాలికల నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 మండలాల్లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 62 కేజీబీవీలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలోని 31 మండలాలకు 32, శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాలకు 30 కేజీబీవీల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. ఒక్కో పాఠశాలలో 40 సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన 2,480 సీట్లను భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లనూ భర్తీ చేయనున్నారు. అర్హులైన వారు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ లోపు దరఖాస్తులను https://apkgbv.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా అందజేయాల్సి ఉంటుంది. వీటిని పరిశీలించిన అనంతరం అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకుల మొబైల్ ఫోన్ నంబర్‌కు మెసేజ్ అందుతుంది.

'నాడు–నేడు'తో మారిన రూపురేఖలు..

రాష్ట్రంలో జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత విద్యారంగంలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. పేదలు, మధ్య తరగతి పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పటిష్ట చర్యలు తీసుకున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమయ్యాయి. మన బడి నాడు–నేడు కార్యాచరణతో ప్రభుత్వ బడుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా రూ. కోట్లు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచారు. ఈ క్రమంలోనే కేజీబీవీల్లోనూ అధునాతన సౌకర్యాలు సమకూరాయి.

వీరికి తొలి ప్రాధాన్యత..

అనాథ, వీధి బాలికలు, పేద పిల్లలతో పాటు బడి బయట ఉన్న పిల్లలు, బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలకు తొలి ప్రాధాన్యత కింద కేజీబీవీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వలస కూలీల చిన్నారులు, అసిస్టెంట్ లేబర్ సహాయ శాఖ అధికారులు సిఫారసు చేసిన వారికీ ప్రవేశాల్లో ప్రాధాన్యత ఉంటుంది. 2018 నుంచి కేజీబీవీల్లో ఇంటర్ విద్యనూ అందుబాటులోకి తీసుకువచ్చారు.

నాణ్యమైన భోజనం..

కేజీబీవీల్లో విద్యార్థినులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని భోజనంగా అందజేస్తున్నారు. ఉదయం నిద్ర లేవగానే బెల్లం పాలతో పాటు రాగిజావ, టిఫెన్‌లో ఉప్మా, పులిహోర, చపాతి, పూరి, ఇడ్లీ, దోసె, పొంగల్, చట్నీ, బర్ఫీ, భోజనంలో అన్నం, పప్పు, రసం, మజ్జిగ, గుడ్డు, రాత్రికి అన్నం సాంబార్, తాళింపు, మజ్జిగ, అరటిపండు ఇస్తారు. వీటితో పాటు ప్రతి ఆదివారం చికెన్ కర్రీ వడ్డిస్తారు.

భద్రతకు మారుపేరు



బాలికలకు భద్రతతో కూడిన విద్యాబోధనను కేజీబీవీలు అందిస్తున్నాయి. ఇంట్లో వాతావరణాన్ని తలపించేలా ఆడపిల్లలకు పూర్తిస్థాయి భద్రత ఉంటుంది. చదువుల్లోనూ కేజీబీవీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల కోసం అర్హులైన విద్యార్థినులు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలి.

– ఎం.సాయిరాం, డీపీఓ, సమగ్రశిక్ష

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు ..



కేజీబీవీల్లో ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లనూ భర్తీ చేస్తున్నాం. బడికి దూరమైన బాలికలు, అనాథ, వీధి బాలికలకు తొలి ప్రాధాన్యత ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలకూ సీట్లు కేటాయిస్తాం.

– ముత్యాలమ్మ, ఎస్‌ఓ, రాప్తాడు

వీడిన హత్య కేసు మిస్టరీ

పావగడ: గుర్తు తెలియని వ్యక్తి హత్యకేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివరాలను సీఐ కాంతారెడ్డి ఆదివారం వెల్లడించారు. పావగడ తాలూకా వైఎన్ హొసకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రబెట్ట వద్ద రోడ్డు పక్కన ఈ నెల 14న పూర్తిగా కాలిపోయిన ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసుగా నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు... అనంతరం హతుడిని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన బోయ రామాంజి (35)గా నిర్ధారించారు. హతుడి భార్య ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. కుందుర్పి మండలం మహంతపురం గ్రామానికి చెందిన కావేరిని పెళ్లి చేసుకున్న రామాంజి ఆ గ్రామంలోనే స్థిర పడ్డాడు. తాగుడుకు బానిసైన ఆయన నిత్యం మద్యం మత్తులో భార్యతో గొడవపడేవాడు. భర్త వేధింపులను భరించలేక భార్య కావేరి, ఆమె చెల్లెలు చిట్టెమ్మ కలసి నాగలమడక హోబళి తిమ్మమ్మనహళ్లి గ్రామానికి చెందిన రవి సహకారంతో రామాంజిని హతమార్చారు. ఈ కేసులో రవిని వైఎన్ హొసకోట పోలీసులు అరెస్ట్ చేసి, ఆదివారం సాయంత్రం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. హత్యకు సూత్రధారులైన కావేరి, చిట్టెమ్మ పోలీస్ కస్టడీలో ఉన్నారు.

'హంతకుణ్ని కఠినంగా శిక్షించాలి'



వినతి పత్రం అందజేస్తున్న మంద కృష్ణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన కడపల రమాదేవి హత్యకేసులో నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా చేయాలంటూ ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్పకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ విన్నవించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బొందలవాడకు చెందిన మాదిగ కె.నారాయణ స్వామి, నారాయణమ్మ దంపతుల కుమార్తె రమాదేవిని, నార్పల మండలం నడిమిదొడ్డికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ జాఫర్ ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక అవసరాలు తీర్చుకున్నాడన్నారు. రమాదేవి డిమాండ్ చేయడంతో పెళ్లి చేసుకుందామంటూ నమ్మబలికి ఈ నెల 4న బుక్కరాయసముద్రం చెరువు వద్దకు పిలుచుకెళ్లి, హతమార్చి చెరువులోని ముళ్ల పొదల్లోకి పడేశాడన్నారు. కుమార్తె కనిపించకుండా పోవడంతో జాఫర్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తూ మరుసటి రోజు నార్పల పోలీసులకు ఫిర్యాదు చేస్తే, కేసు నమోదు, విచారణలో అక్కడి నిర్లక్ష్యం చేసిన సీఐ, ఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లనూ సస్పెండ్ చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ సంఘాల అధ్యక్షుడు సాకే హరి, పెద్దిరాజు, స్వతంత్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎంఎస్ లక్ష్య సాధనలో వెనుకంజ



అనంతపురం: ఉన్నత విద్యామండలికి, విద్యార్థికి వారధిగా పనిచేస్తున్న లర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (అభ్యసన నిర్వహణ ప్రక్రియ – ఎల్‌ఎంఎస్)లో విద్యార్థుల భాగస్వామ్యం లోపించింది. నిర్దేశించిన లక్ష్య సాధనలో ఎస్కేయూ వెనుకబడింది. ఉన్నత విద్యామండలి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యాచరణలో విద్యార్థుల నమోదు శాతం తక్కువగా ఉండడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటి వరకూ మొత్తం 22,364 మంది విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందగా... ఇందులో కేవలం 49 శాతం మంది మాత్రమే తన ప్రొఫైల్‌ను అప్‌డేటా చేశారు. మిగిలిన 51 శాతం మంది విద్యార్థులు అప్‌డేటా చేయకుండా మిన్నకుండిపోయారు. వాస్తవానికి ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్ కోర్సులు, ఆన్‌లైన్ కోర్సులు, డిజిటల్ లైబ్రరీ, ఉద్యోగ నియామకాలు నిర్వహిస్తున్న కంపెనీల వివరాలు, క్యాంపస్ ఇంటర్వ్యూల వివరాలు, విద్యార్థి, అధ్యాపకులకు సంబంధించిన అంశాలు తదితర వివరాలను నేరుగా విద్యార్థి ఈ మెయిల్‌కు పంపే విధానమే లర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించే సరికొత్త అప్లికేషన్ ప్రక్రియ ఇది. ఇందులో అధ్యాపకుల వీడియో పాఠాలు అప్‌లోడ్ చేస్తారు. ఈ పాఠ్యాంశాలను ఎన్‌రోల్ చేసుకున్న విద్యార్థి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఇండస్ట్రియల్ ఇనిస్టిట్యూట్ కనెక్ట్ (పరిశ్రమలు–విద్యార్థికి అనుసంధానం) చేసి ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తారు . పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు వారధిలా ఈ పోర్టల్ పనిచేస్తుంది. లర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ప్రతి విద్యార్థి ప్రొఫైల్ వెరిఫికేషన్ చేసేలా కృషి చేస్తున్నామని ఎస్కేయూ రెక్టార్ ఎ.మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఇదే అంశంపై అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

ఆదర్శప్రాయం.. ముడార్ జీవితం



ముడార్ వేణుగోపాల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాటి విప్లవ సంఘం ప్రతినిధులు, కుటుంబసభ్యులు

అనంతపురం కల్చరల్: అనంత విప్లవ సాహిత్యంతో విడదీయలేని అనుబంధమున్న ముడార్ వేణుగోపాల్ జీవితం ఆద్యంతం ఆదర్శప్రాయమని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. విప్లవ యోధుడు ముడార్ వేణుగోపాల్ 88వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహావిష్కరణ, ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ సమావేశాన్ని ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. సభకు జట్టీ జైరామ్ అధ్యక్షత వహించి నాటి విశేషాలను పంచుకున్నారు. లోచర్ల పెద్దారెడ్డి ట్రస్ట్ వ్యవస్థాపకుడు లోచర్ల విజయభాస్కరరెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, ఆలీఖాన్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్‌ఎం బాషా, కవులు రాధేయ, నబీరసూల్, ముడార్ సుధీర్ తదితరులు మాట్లాడుతూ.. అనంతతో ముడార్ వేణుగోపాల్‌కున్న అనుబంధాన్ని వివరించారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి నిరంకుశ ప్రభుత్వ వైఖరిని ఎదురించి, అనంత గడ్డపై విప్లవ బీజాలు నాటిన ముడార్ వేణుగోపాల్ పేరుతో ఉగాది పురస్కారాలను అందించడం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. నక్సల్‌బరి ఉద్యమ సానుభూతిపరుడిగా జిల్లాలో నిరుపేదల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. అంతకు ముందు ప్రత్యేక సందేశం ద్వారా అక్షయ ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ అలరించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కవితల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ముడార్ ఉగాది పురస్కారాలనందించారు. కార్యక్రమంలో ఆశుకవి రియాజుద్దీన్, కవి డాక్టర్ అంకె రామలింగమయ్య, మానవతా సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, అనంత జిరసం అధ్యక్ష కార్యదర్శులు సాకే శ్రీహరిమూర్తి, తోట నాగరాజు, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, వన్నప్ప, జూటూరు షరీఫ్, చెట్ల ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల ఆరాధ్యుడు సీఎం వైఎస్ జగన్





వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా నరసింహయ్య తదితరులు, ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ
- బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటామంటూ ప్రకటన

అనంతపురం సిటీ: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆ సామాజిక వర్గానికి ఆరాధ్యుడిగా మారారంటూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనియాడారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశానికి అసెంబ్లీలో తీర్మానం చేసిన నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ గిరిజమ్మ నాయకత్వంలో ఆదివారం అనంతపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

అంతకు ముందు జెడ్పీ ఆవరణలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా పాతూరులోని పవర్ ఆఫీస్ వద్ద ఉన్న వాల్మీకి విగ్రహం వద్దకు చేరుకుని పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో గిరిజమ్మ మాట్లాడారు. వాల్మీకుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిన సీఎం వైఎస్ జగనన్నకు యావత్ వాల్మీకులు రుణపడి ఉంటారన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు వాల్మీకులు జేజేలు పలుకుతుండడాన్ని చూసి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తానంటూ 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకుండా వంచనకు గురి చేశాడని మండిపడ్డారు. జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత ఈ అంశానికి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేకంగా కమిషన్ వేసి సాధ్యాసాధ్యాలపై నివేదికను సీఎం వైఎస్ జగన్ తెప్పించుకుని, దానికి అసెంబ్లీలో తీర్మానం చేయడం గొప్ప విషయమన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరా, అగ్రి మిషన్ సభ్యుడు రాజారాం, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండమ్మ, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి కటారు లక్ష్మి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు, ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు, మార్కెట్ యార్డు చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ, అనుబంధ విభాగాలకు చెందిన అన్ని క్యాడర్ల నాయకులు, కార్యకర్తలు, వందలాది మంది అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు జైలు జీవితం తప్పదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం సిటీ: నిరుద్యోగులకు ఉపాధి నైపుణ్యాభివృద్ధి శిక్షణ పేరుతో రూ. కోట్లు కొల్లగొట్టిన కుంభకోణంలో అసలు సూత్రధారిగా ఉన్న చంద్రబాబు త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలసి ఆమె క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్కామ్‌లు చేసి ప్రజల సొమ్ము దోచుకోవడంలో చంద్రబాబును మించిన వారు లేరన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యువతకు ఉపాధి శిక్షణ కల్పిస్తున్నట్లుగా నమ్మించి సీమెన్స్ కంపెనీ పేరుతో రూ.371 కోట్లను దోచుకున్నాడని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించి చేసిన ప్రాజెక్ట్ నోట్ ఫైల్స్‌ను కూడా మాయం చేయడం చంద్రబాబు నేర ప్రవృత్తికి నిదర్శనమన్నారు. 2017లోనే ఈ స్కామ్ బయటపడినా సీఎం హోదాలో ఉన్న చంద్రబాబు తొక్కిపెట్టాడన్నారు. అయితే ఈ కుంభకోణంపై స్పందించిన సీమెన్స్ సంస్థ తామెలాంటి ఒప్పందం చేసుకోలేదని తేల్చి చెప్పిందన్నారు. దీంతో ఈ కుంభకోణంపై జీఎస్టీ, ఇంటెలిజెన్స్, ఈడీ, సీఐడీ సమగ్ర దర్యాప్తు చేపట్టాయన్నారు. ఈ క్రమంలోనే 26 మందికి ఈడీ నోటీసులు జారీ చేసిందన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో అమరావతి ప్రాంతంలో చోటు చేసుకున్న అక్రమాలు, స్కామ్‌లు కూడా వెలుగులోకి వచ్చాయని, త్వరలో చంద్రబాబు జైలుకెళ్లడం ఖాయమని అన్నారు. పార్టీ రామగిరి మండల కన్వీనర్ రమేష్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూసి, నాయకులు అక్బర్, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌బాబు పాల్గొన్నారు.

సాయి వైభవం.. నేత్రపర్వం



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ప్రశాంతి నిలయం: సత్యసాయి వైభవాన్ని చాటుతూ ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో మహాసమాధి చెంత విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. చక్కటి భక్తిగీతాలు ఆలపిస్తూ అందుకు తగ్గట్టుగా చేసిన నృత్య ప్రదర్శనలు నేత్రపర్వంగా సాగాయి. కరిష్యే వచనం తవా పేరుతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో మందిరం మార్మోగింది.

తాగుడు మానేయమంటే... తాడుతో ఉరేసుకున్నాడు!



పవన్‌కుమార్ (ఫైల్)

లేపాక్షి: మద్యం మానేయాలంటూ తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. లేపాక్షి మండలం కోడిపల్లికి చెందిన కిష్టప్ప కుమారుడు పవన్‌కుమార్ (22) తాగుడుకు బానిసగా మారి జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో మద్యం కొనుగోలుకు డబ్బు కోసం కుటుంబసభ్యులను వేధించేవాడు. శనివారం సాయంత్రం మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వలేదంటూ తండ్రిపై భౌతిక దాడికి దిగడంతో కుటుంబసభ్యులు అడ్డుకుని హితవు పలికారు. తాగుడు మానేసి, ఏదైనా పని చేసుకుని జీవితంలో స్థిరపడాలని హెచ్చరించారు. దీంతో మనస్తాపం చెందిన పవన్‌కుమార్ అదే రోజు రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి, గ్రామశివారులోని చింత చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి, సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై లేపాక్షి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బీచిగానిపల్లిలో పరస్పర దాడులు

పరిగి: ఇరు వర్గాల పరస్పర దాడులతో పరిగి మండలం బీచిగానిపల్లిలో ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు తెలిపిన మేరకు.. బీచిగానిపల్లికి చెందిన ప్రభాకర్, అతని సోదరుడు గంగరాజుకు అదే గ్రామ సర్పంచ్ బాలాజీ, అతని అనుచరుల మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఈ నెల 12న గంగరాజుతో పాటు ఎస్సీ వర్గానికి చెందిన పలువురిపై బాలాజీ వర్గీయులు దాడి చేశారు. ఘటనకు సంబంధించి బాలాజీ వర్గీయులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద పరిగి పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న బాలాజీ, అతని సోదరుడు యల్లప్ప, అనుచరులు పాపన్న గారి ప్రభాకర్, శివ, మల్లేష్, రామాంజి ఆదివారం ఉదయం తమకు ఎదురుపడిన నగేష్, సుభద్రమ్మ, సత్యప్ప, ఈశ్వర్‌ను కులం పేరుతో దూషిస్తూ దాడికి దిగారు. ఘటనను గమనించిన గంగరాజు, పలువురు ఎస్సీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో రాళ్లు, కర్రలతో గంగరాజుపై దాడి చేస్తుండగా అడ్డుకోబోయిన తల్లి పాపమ్మ తీవ్రంగా గాయపడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆగమేఘాలపై గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఏఎస్‌ఐలు జయలత, హిదాయతుల్లా నేతృత్వంలో గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

నేడు 'స్పందన'

కనగానపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం'స్పందన' నిర్వహిస్తామని తహసీల్దార్ పీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమం మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

దాదులూరు పోతలయ్యకు ప్రత్యేక పూజలు



దాదులూరు పోతలయ్యస్వామి

కనగానపల్లి: దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పండుగ తర్వాత చుట్టుపక్కల గ్రామాల స్వామికాపులు, భక్తులు ఆలయానికి వచ్చిస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పోతలయ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

కార్తికేయుడికి విశేష పూజలు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పంచామృతాభిషేకాలు, మహా మంగళహారతి అందించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

సంతల ద్వారా రూ.3.25 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.25 లక్షలకు పైగా ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,62,520 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,63,300 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మసీదుల అభివృద్ధికి తోడ్పాటునందించండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: మసీదుల అభివృద్ధికి తోడ్పాటునందించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తెలిపారు. స్థానిక నూరాని మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జామియా మసీదు ఈఓగా నియమితులైన హుస్సేన్‌సాబ్‌ను మసీదు కమిటీ సభ్యులకు పరిచయం చేశారు. ఇటీవల జామియా మసీదు, ఈద్గా మసీదు, నూరాని మసీదు, వాటి అనుబంధ కార్యకలాపాలకు ఆయనను ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించడం గర్వకారణమని తెలిపారు.

ముసుగు తొలగించేదెప్పుడో?



ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహానికి తొలగించని ముసుగు

ఆత్మకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా మండలంలో రాజకీయ పార్టీ నేతల విగ్రహాలు, ఫొటోలకు అధికారులు ముసుగు తొలగించలేదు. ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహంతో పాటు సీఎం జగన్ ఫొటోలకు కూడా ముసుగు తీయలేదు. ఆత్మకూరు నడిబొడ్డున ఏర్పాటు చేసిన పరిటాల రవి కటౌట్‌కు ముసుగు తొలగించారు. కోడ్ ముగిసినా అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు.

రాజేష్ స్వామికి నంది అవార్డు



అవార్డునందుకుంటున్న రాజేష్‌స్వామి

అనంతపురం: ఎస్కేయూ సమీపంలోని పురాతన బసవన్న స్వామి ఆలయ పురోహితుడు, వేదపండితుడు రాజేష్‌స్వామి నంది పురస్కారమందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కళానిలయంలో నంది అవార్డుల పురస్కార ప్రదానోత్సవం జరిగింది. సంస్కృతి సంఘం సంస్థ ఆధ్వర్యంలో ఆయనకు నిర్వాహకులు వైదిక పురోహిత రత్న, అలంకార సామ్రాట్ బిరుదులతో పాటు నంది అవార్డు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పురోహిత సంఘం నాయకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నాటకం.. నవరత్నం

వినోదం కోసం అత్యధిక ఆదరణ పొందిన కళల్లో నాటకం ఒకటి. నాటకం అనేది శ్రవణ సహిత దృశ్య రూపక ప్రదర్శన. నాటక ప్రదర్శనతో పురాణ ఇతిహాస కథలనే కాకుండా సంక్షేమ, అభివృద్ధి పథకాల విశిష్టత, అమలుతీరును సందేశాత్మకంగా, చైతన్యవంతంగా ప్రదర్శనల రూపంలో చెప్పొచ్చు. ప్రభుత్వం అన్ని వర్గాలవారికి నవరత్నాల పేరిట అందిస్తున్న పథకాలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం తదితర అంశాలను ఇతివృత్తంగా తీసుకొని అంధకళాకారుడు ఈశ్వరయ్య, ఇజ్రాయెల్ రాసిన పద్యనాటాన్ని 'జగనన్న జయకేతనం' పేరుతో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఇలా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో కళాకారులు అనేక పద్య నాటకాల ద్వారా ప్రజలను ఆకట్టుకుంటున్నారు. సోమవారం నుంచి నాటక ప్రదర్శనలు జరుగనున్నాయి.

- నేటి నుంచి 'జగనన్న జయకేతనం' నాటక ప్రదర్శనలు
- ఆకట్టుకుంటున్న పద్యనాటకాలు



నాటక ప్రదర్శనలో ఓ ఘట్టం (ఫైల్)

అనంతపురం కల్చరల్: అనంతపురం జిల్లాకు చెందిన మైఖేల్‌బాబుకు చిన్నతనం నుంచే నాటకాలపై ఆసక్తి ఉంది. నాటక ప్రదర్శనలకు సమన్వయకర్తగా, దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వందలాదిగా నాటకాలను ప్రదర్శింపజేశారు. దక్షిణభారత దేశ సాంస్కృతిక మండలి సభ్యుడిగా ఉన్నరోజుల్లో దివంగత నేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఆయన ప్రజాసంక్షేమం పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆయన అకాల మరణం తదితర ఘట్టాలపై ప్రముఖ అష్టావధాని డాక్టర్ అమళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్ 'విజయభవనం' పేరిట నాటకం రాశారు. దాన్ని మైఖేల్ బాబు నేతృత్వంలో కళాకారుల బృందం జిల్లా వ్యాప్తంగా ప్రదర్శించి, మెప్పించారు. ఆ కోవలోనే నాలుగేళ్లగా 'జగనన్న జయకేతనం' పేరుతో ప్రభుత్వం అన్ని వర్గాలవారికి నవరత్నాల పేరిట అందిస్తున్న పథకాలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం తదితర అంశాలను ఇతివృత్తంగా తీసుకొని అంధక ళాకారుడు ఈశ్వరయ్య, ఇజ్రాయెల్ రాసిన పద్యనాటాన్ని అనేక ప్రదర్శనలు ఇచ్చారు.

నేటి నుంచి నాటక ప్రదర్శనలు :

శ్రీసత్యసాయిబాబా నాటకోత్సవ సమితి నేతృత్వంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 5 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ మండల కేంద్రాలు, గ్రామాల్లో 'జగనన్న జయకేతనం' నాటక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. 27న అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి, 28న మన్నీల 29న ఉరవకొండ మండలం కొనకొండ్ల, 30న వజ్రకరూరు మండలం రాములపాడు, 31న రామగిరితండా, ఏప్రిల్ 1న గుంతకల్లు మండలం కసాపురం, 2న బుక్కరాయసముద్రం మండలం అగ్రహారం, 3న పామిడి మండలం కొత్తపల్లి, 4న ఎద్దులపల్లి, 5న రూరల్ మండలం రుద్రంపేట తదితర చోట్ల వరుసగా నాటకాన్ని ప్రదర్శనలు ఉంటాయి.

కళారూపాలను ఆదరించాలి



దశాబ్దాలుగా నాకు నాటక రంగంపై ఆసక్తి ఉంది. ప్రస్తుత రోజుల్లో సాంకేతికత అభివృద్ధి చెంది, సినిమాలకు ఆదరణ ఉంది. నాటకాలను ప్రోత్సాహం కరువై, ఆదరణ తగ్గిపోయింది. ప్రభుత్వ ఆర్థిక సహకారంతో మేము ఉచిత నాటక ప్రదర్శనలిస్తున్నాం. గ్రామాల్లో ప్రజల సమయానుకనుగుణంగా నాటకాలు ప్రదర్శిస్తున్నాం. కళాభిమానులు విరివిగా వస్తేనే కళాకారులను ప్రోత్సహించినట్టవుతుంది. ప్రభుత్వం నుంచి గుర్తింపు ఉన్నా కొన్ని కళాసంస్థలు మాకు అవకాశాలు ఇవ్వడంలేదు. ఇప్పటికైనా కళారూపాలను ఆదరించాలి.

– మైఖేల్‌బాబు, నాటక ప్రదర్శనల నిర్వాహకుడు, దర్శకుడు

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

- ఐఐఎస్ఈఆర్ ప్రొఫెసర్ సౌమిత్రో బెనర్జీ

రాప్తాడురూరల్: సైన్స్ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లో ఫిజికల్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ సౌమిత్రో బెనర్జీ అన్నారు. బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరుగుతున్న రాష్ట్రస్థాయి సైన్స్‌కాన్ఫరెన్స్ ఆదివారం ముగిసింది. నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సౌమిత్రో బెనర్జీ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ చదువుతున్నా ఆలోచనలో సైన్స్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. సైన్స్ చదివితే విలువ లేదనడం తప్పు.. సైన్సు ఆలోచన ప్రక్రియను అలవర్చుకుంటే గొప్ప వ్యక్తులుగా తయారవుతారన్నారు. శాస్త్రీయ పరిశోధనలకు ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కర్ణాటక ఆనంద్ రాజ్, తెలంగాణ డాక్టర్ ఆర్ గంగాధర్, డాక్టర్ జరీనా, తబ్రేజ్ ఖాన్, మల్లిక్ దత్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉద్యోగుల ర్యాలీ

అనంతపురం సిటీ: నగరంలో జిల్లా పరిషత్ కార్యాలయ ఉద్యోగులు ఆదివారం ర్యాలీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం ద్వితీయ జిల్లా కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో సంఘం జిల్లా ప్రతినిధి మర్తాడు షేక్ రఫీ నాయకత్వంలో ర్యాలీ చేశారు. జెడ్పీ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ మీదుగా ర్యాలీ కొనసాగింది. ఆ తర్వాత వారంతా కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: అధైర్యపడొద్దు.. మీ కుటుంబానికి అండగా ఉంటామని ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా కల్పించారు. ఆదివారం మండల కేంద్రంలోని సిద్దికూటి వెంకట్రామిరెడ్డి ఇంటికి వెళ్లి వెంకట్రామిరెడ్డి ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతని భార్య వెంకటలక్ష్మి, కుమారుడు చరణ్‌సాయిరెడ్డి, కూతురు అర్చితతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వెంకట్రామిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని తెలియచేశారు. ముఖ్య నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలపోతన్న, వాసుదేవరెడ్డి, మధు, నరసింహారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి,గూలి కొండారెడ్డి,మల్లన్న, ఆంజనేయులు, ఈశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామాయణం ఆచరణ ప్రధాన గ్రంథం

- పుస్తకావిష్కరణ సభలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

అనంతపురం కల్చరల్: పవిత్ర ఇతిహాసమైన రామాయణం కేవలం పఠనీయ గ్రంథమే కాకుండా ఆచరణ ప్రధాన కావ్యమని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విజయనగర్ లా కాలేజీలో పామిరెడ్డి దామోదరరెడ్డి రాసిన ' వాల్మీకి రామాయణం – చారిత్రక దృక్కోణం' అనే పుస్తకావిష్కరణ జరిగింది. వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఏలూరు యంగన్న అధ్యక్షత వహించారు. విశ్వేశ్వరరెడ్డితో పాటు ఇండియన్ బార్ కౌన్సిల్ సభ్యుడు ఆలూరు రామిరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, సాహిత్య విమర్శకులు డాక్టర్ కె.ఆనందరావు తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రపంచ మానవాళికి మార్గదర్శనం చేసిన అన్ని కావ్యాల్లో రామాయణానికి విశేష స్థానముందన్నారు. అంతకుముందు పద్యగాయకుడు వెంకటేశ్వర ప్రసాద్ పద్యగానం ఆకట్టుకుంది.

అవినీతిని ప్రశ్నిస్తే అనర్హత వేటు వేస్తారా?

అనంతపురం టవర్‌క్లాక్: అవినీతిని ప్రశ్నించినందుకు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేస్తారా? అని ఏఐసీసీ సభ్యుడు శంకర్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న మహాత్మ గాంధీవిగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. శంకర్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ చేస్తున్న అవినీతిపై రాహుల్‌గాంధీ ప్రశ్నించినందుకు అనర్హత వేటు వేయడం అన్యాయమన్నారు. ఆయన జైలుకు వెళ్తే దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప.. మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధే మీలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్ యాదవ్, సురేష్, గాజుల వాసు, నజీర్ అహ్మద్, రామ్‌చరణ్ యాదవ్, కృష్ణ, మసాల రవి, పరమేశ్వర రెడ్డి, నాగరాజు, శర్మాస్ వలి, నిశాంత్‌రెడ్డి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు మేయర్ వసీం అధ్యక్షత కౌన్సిల్ సమావేశం జరగనుంది. మొత్తం 18 అభివృద్ధి కార్యక్రమాలతో అజెండా సిద్ధం చేశారు. ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్యం మెరుగుపర్చడం, టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యంపై చర్చకు వచ్చే అవకాశం ఉంది.

అజెండా ఇదే :

- 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించేందుకు, స్మార్ట్ స్ట్రీట్స్‌కు నిధులు కేటాయింపు. మృతి చెందిన ఇంజినీరింగ్ కార్మికుడు సీ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు నీటి సరఫరా విభాగంలో ఒప్పంద కార్మికురాలిగా అవకాశం కల్పించడం. ఏపీఎండీపీ పైప్‌లైన్ పథకంలో మిగిలిపోయిన పైప్‌లైన్ పనులకు సాధారణ నిధులు రూ.1.85 కోట్లు కేటాయింపు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేయడానికి కన్సల్టెన్సీ ఏర్పాటు. రూ.1.70 కోట్లతో డీఐ పైప్‌తో హౌస్ సర్వీస్ కనెక్షన్స్ ఏర్పాటు. సంత మార్కెట్ లీజు , జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించి టవర్‌క్లాక్ సమీపంలోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 9,10 షాపులను ఖాళీ చేయించడం, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ఆమోదం తెలుపనున్నారు.

33 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రుద్రంపేటలోని 44వ జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద ఆదివారం ఉదయం 33 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపారు. ఆదివారం బుక్కపట్నం మండలం రామసాగరానికి చెందిన డ్రైవర్ గుజ్జల సతీష్ నగరంలోని పలు ప్రాంతాల్లో కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అశోక్ లేలాండ్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. నాల్గో పట్టణ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

అత్యాధునిక వైద్యం ప్రజలకు చేరువ

- మెడికల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ

అనంతపురం సప్తగిరి సర్కిల్: అత్యాధునిక వైద్యాన్ని అనంత ప్రజలకు చేరువ చేసేందుకు కేసీ రామన్న పేరుతో హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం గర్వకారణమని ప్రభుత్వ మెడికల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ తెలిపారు.ఆదివారం స్థానిక రాంనగర్‌లోని ఆంధ్ర బ్యాంకు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కేసీ రామన్న హాస్పిటల్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నగరంలో డాక్టర్ మహేష్, డాక్టర్ ప్రేణలు మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించి, నగర ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించనుండడం గర్వకారణమన్నారు. వైద్యులు మహేష్, ప్రేరణలు మాట్లాడారు. నగరంలోని రాంనగర్‌లో ప్రత్యేక సదుపాయాలతో వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. 24 గంటల పాటు అత్యవసర, అన్నిరకాల వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆస్పత్రిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా పెద్దమ్మ జాతర



జాతరకు తరలివచ్చిన జనం



పెద్దమ్మ దేవతకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



పూజలందుకుంటున్న పెద్దమ్మ దేవత



సల్లాపురమ్మ దేవత

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పెద్దమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉగాది తర్వాత ప్రసన్నాయపల్లి గ్రామస్తులు గ్రామ దేవతకు బోనాలు సమర్పించారు. జాతరకు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ప్రసన్నాయపల్లి వీధులు జనసంద్రమయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకాలు, కుంకుమపూజ, ఆకుపూజ, అభిషేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు జంతుబలి ఇచ్చారు. సాయంత్రం గ్రామంలో వసంతోత్సవం జరుపుకున్నారు. జాతరలో పాల్గొన్న ప్రముఖులు: జాతరలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఆయన తనయుడు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, నాయకులు భూమిరెడ్డి మహానందరెడ్డి, సర్పంచు శశికళ, మాజీ సర్పంచు భూమిరెడ్డి సావిత్రి, నారాయణమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు భూమిరెడ్డి రాధ, వెల్పుల రాజశేఖర్, వెల్పుల లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఎనిమిదేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ నేత ప్రసన్నాయపల్లి భూమిరెడ్డి ప్రసాదరెడ్డి తహసీల్దార్ కార్యాలయంలోనే దారుణహత్యకు గురైన విషయం విదితమే. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇటుకలపల్లి సీఐ మోహన్, రాప్తాడు, ఇటుకలపల్లి ఎస్ఐలు పీవై ఆంజనేయులు, శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా సల్లాపురమ్మ పార్వేట

రాప్తాడు: ఎం.బండమీదపల్లి గ్రామంలో వెలసిన సల్లాపురమ్మ జాతర (పార్వేట)ను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉగాది పండుగ తర్వాత నాలుగు రోజులపాటు సల్లాపురమ్మ జాతరను నిర్వహిస్తారు. మొదటి రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. పార్వేట ముందు రోజు అంటే రెండోరోజు గ్రామస్తులు అడవుల్లోకి వేటకు వెళ్లి కుందేళ్లను పట్టుకొస్తారు. ఆలయం దగ్గర శివుడి పార్వేట నిర్వహించారు. మూడో రోజు ఉదయం సల్లాపురమ్మ అమ్మవారిని గ్రామంలోకి తీసుకెళ్లి పూజలు చేశారు. ఉదయం గ్రామంలో అమ్మవారికి జంతు బలి ఇచ్చారు. యువకులు టెంకాయలు, చీనీకాయలు, నిమ్మకాయలను విసిరే పందేలు ఆడారు. ఆలయ ప్రాంగణం భక్తులు, అంగళ్లతో కళకళలాడింది. ఎస్ఐ పీవై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

వడ్డీ మాఫీకి ఐదురోజులే గడువు

- 17 నుంచి అవకాశం కల్పించిన ప్రభుత్వం
- మొత్తం బకాయి ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ
- 10 రోజుల్లో రూ.5.82 కోట్ల పన్ను వసూలు



అనంతపురం క్రైం: నగర పాలక సంస్థ పరిధిలో ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయి రూ.కోట్లలో ఉంది. పన్ను వసూలుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రచారం చేశారు. పన్ను చెల్లించాలని బకాయిదారులను కోరుతున్నా ఆశించిన స్థాయిలో వసూలు కావడంలేదు.

ప్రభుత్వం ఈనెల 17న బకాయిదారులకు సదవకాశం కల్పించింది. బకాయి పన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు బృందాలుగా ఏర్పడి పన్ను వసూళ్లపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. గడిచిన పది రోజుల్లో రూ.5.82 కోట్లు పన్ను వసూలైంది. రానున్న 5 రోజుల్లోనూ వంద శాతం పన్ను వసూలు లక్ష్యంగా నగరపాలక సంస్థ అధికారులు ముందుకెళ్తున్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఇంటి పన్నుకు సంబంధించి మొత్తం 58,191 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఆ అసెస్‌మెంట్లకు డిమాండ్ రూ.51.33 కోట్లు ఉంది. కాగా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 26 వరకు రూ.36.2727 కోట్లు వసూలైంది. మొత్తం 70.70 శాతం వసూలు చేశారు. గత ఆర్థిక సంవత్సరం (2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి)లో కేవలం రూ.28.17 కోట్లు మాత్రమే వసూలైంది. గతేడాదితో పోలిస్తే మొత్తం పన్ను వసూలులో 28.70 శాతం అదనంగా వసూలైంది. ఇదిలా మొత్తం డిమాండ్‌లో మిగిలిన రూ.15.05 కోట్ల పన్నులో పోలీసు కాంప్లెక్స్ నిర్వాహకులు రూ.2 కోట్లు, కృష్ణ కళామందిర్, ఎన్‌జీఓ హోంలు రూ.కోటి, వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు రూ.2.5 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. వీటిని మినహాయిస్తే మొత్తం రూ.8.06 కోట్ల వరకు మాత్రమే ఉంటుంది.

పది రోజుల్లో రూ.5.82 కోట్లు:

ప్రభుత్వం ఈ నెల 17న వడ్డీ మాఫీకి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి కమిషనర్ రమణారెడ్డి పర్యవేక్షణలో ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు మురళీ, వేణు, బాబు, పద్మావతి, 74 సచివాలయల పరిధిలోని అడ్మిన్, పట్టణ ప్రణాళిక కార్యదర్శి, ఎడ్యుకేషన్ కార్యదర్శులు బృందాలుగా ఏర్పడి పన్ను వసూళ్లపై అవగాహన కల్పించారు. మొత్తం బకాయి చెల్లిస్తే ఎంత వడ్డీ మాఫీ అవుతుందో ఆ మొత్తాన్ని కరపత్రాల రూపంలో బకాయిదారులకు తెలియజేశారు. ఆటోల ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్ చేయించారు. తద్వారా రూ.5.82 కోట్ల వరకు పన్ను వసూలైంది. నగరపాలక సంస్థలోని మూడు కౌంటర్లు, పాతూరు, రాంనగర్, రెండో రోడ్డు, నవోదయ కాలనీల్లోని మొత్తం నాలుగు సచివాలయాల్లో పన్ను చెల్లింపు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

వడ్డీ మాఫీకు ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉంది. అంతలోపు బకాయిదారులు పన్ను చెల్లించాలి. స్వచ్ఛందంగా పన్ను చెల్లించాలి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశాం. పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలి.

– రమణారెడ్డి, కమిషనర్

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

అనంతపురం: రాప్తాడు పంచాయతీ పరిధిలోని గంగలకుంటలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ రెండో యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. కార్యక్రమానికి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సేవాభావంతోనే వృత్తిలో రాణిస్తారన్నారు. ఇంటింటి సర్వేతో పాటు పచ్చదనం-పరిశుభ్రత, ఆరోగ్యం , గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు లాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు మధు తదితరులు

అనంతపురం కల్చరల్:నగరంలోని పీటీసీ వద్ద గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. నడిమివంక బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడంతో ఆలయ ఎత్తు తగ్గిపోయింది. ప్రజల కోరిక మేరకు ఆలయాన్ని ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతకుంట మధు హాజరై ప్రత్యేక పూజతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచనల మేరకు అనువైన ప్రదేశంలో గంగమ్మ ఆలయానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వడ్డే గోపాల్, కృష్ణ మూర్తి, శ్రీరాములు, సరస్వతి, నాగలక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు.